నమస్తే తెలంగాణ
మెదక్
15 | హైదరాబాద్, శనివారం 10 ఫిబ్రవరి 2024 | MEDAK

ఆటో కార్మికులను ఆదుకోవాలని ప్లకార్డులు ప్రదర్శిస్తూ అసెంబ్లీకి వస్తున్న సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి

- నెలకు రూ.10 వేల వేతనం ఇవ్వాలి
- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని స్వాగతిస్తున్నాం
- ఎమ్మెల్యేలు హరీశ్‌రావు సునీతాలక్ష్మారెడ్డి
- ఎమ్మెల్యే క్వార్టర్స్ నుంచి అసెంబ్లీ వరకు ఆటోలో ప్రయాణించిన ఎమ్మెల్యేలు

ఆటో డ్రైవర్లకు మద్దతుగా ఆటోలో ప్రయాణిస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

నర్సాపూర్, ఫిబ్రవరి 9: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకంతో ఆటోడ్రైవర్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, వారికి ప్రతి నెలా రూ.10 వేల వేతనం చెల్లించాలని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం అసెంబ్లీ సమావేశంలో వారు మాట్లాడారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని స్వాగతిస్తున్నామని, అయితే, బస్సులు ఎక్కువ సంఖ్యలో లేకపోవడంతో మహిళలు, ఉద్యోగులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కొంద రు ఆటోడ్రైవర్లు కుటుంబాన్ని పోషించలేక ఆత్మహత్యలు చేసుకున్నారని, వారి కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఆటో డ్రైవర్లకు మద్దతుగా ఆటోలో ప్రయాణం

బీఆర్ఎస్ పార్టీ అధిష్ఠానం పిలుపు మేరకు ఆటో డ్రైవర్లకు మద్దతుగా హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్ నుంచి అసెంబ్లీ వరకు ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, సునీతాలక్ష్మారెడ్డి ఆటోలో ప్రయాణించారు. ఆటో డ్రైవర్లకు నెలకు రూ.10వేల ఆర్థిక సాయం ప్రకటించి బడ్జెట్‌లో ప్రవేశపెట్టాలని ప్లకార్డును ప్రదర్శించారు.

పార్లమెంట్ ఎన్నికలే లక్ష్యంగా పనిచేయాలి

హుస్నాబాద్, ఫిబ్రవరి 9: వచ్చే పార్లమెంట్ ఎన్నికలే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ సాధనలో కీలకపాత్ర పోషించిన మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్‌ను మళ్లీ ఎంపీగా గెలిపించుకోవాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, ప్రస్తుత ప్రభుత్వం చేస్తున్న నిర్లక్ష్యాన్ని ప్రజలకు వివరించాలన్నారు. ఆరు గ్యారెంటీల అమలులో ప్రభుత్వ తీరును ఎప్పటికప్పుడు ఎండగట్టాలన్నారు. మాజీ ప్రధాని పీవీ నర్సింహారావుకు భారతరత్న పురస్కారం రావడంపై సమావేశం ఏకగ్రీవంగా హర్షం వ్యక్తం చేసింది. సమావేశంలో సిద్దిపేట జడ్పీ వైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజిరెడ్డి, ఎంపీపీ లకావత్ మానస, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వంగ వెంకట్రామ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ రజనీతిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

నిబంధనలు పాటించాలి

సిద్దిపేట సీపీ అనురాధ

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 9: సిద్దిపేట జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారించి విలువైన ప్రాణాలు కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని.. ప్రజలు రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు పాటించి వాహనాలు నడపాలని సిద్దిపేట సీపీ అనురాధ సూచించారు. 35వ జాతీయ భద్రత మాసోత్సవాల సందర్భంగా సిద్దిపేట పట్టణంలోని పోలీస్ కన్వెన్షన్ సెంటర్‌లో సిద్దిపేట ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన అవగాహనలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు క్షతగాత్రులను (గోల్డెన్ అవర్) గంట లోపు దగ్గరలో ఉన్న దవాఖానకు తరలించి ప్రాణాలు కాపాడాలన్నారు. ప్రమాదాల నివారణ గురించి 66 గ్రామాల్లో 462 మంది రోడ్డు సేఫ్టీ కమిటీ సభ్యులను నియమించామన్నారు. మానవ జీవితం చాలా విలువైందని.. కార ణం లేని మరణం రోడ్డు ప్రమాదం మాత్రమే అన్నా రు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ ప్రసన్నకుమార్, ఏసీపీ సురేందర్‌రెడ్డి, సీసీఆర్‌బీ ఏసీపీ చంద్రశేఖర్, ట్రాఫిక్ పోలీసులు, సిబ్బంది, రోడ్డు సేఫ్టీ కమిటీ సభ్యులు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, హెచ్‌కేఆర్, ఆర్ అండ్‌బీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సిద్దిపేటలో మాట్లాడుతున్న సీపీ అనురాధ, హాజరైన పోలీస్ అధికారులు, సిబ్బంది, రోడ్డు సేఫ్టీ కమిటీ మెంబర్లు

సబ్బుపై పీవీ చిత్రం

గజ్వేల్, ఫిబ్రవరి 9: మాజీ ప్రధాని పీవీ నర్సింహారావుకు భారత ప్రభుత్వం భారతరత్న ప్రకటించింది. శుక్రవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణానికి చెందిన రామకోటి రామరాజు సబ్బుపై పీవీ చిత్రం గీసి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఖ్యాతిని ఢిల్లీలో వినిపించిన పీవీకి అవార్డు రావడం తెలంగాణ సమాజానికి గర్వకారణమన్నారు.

ప్రధానిగా ఉన్న సమయంలో పీవీ నర్సింహారావుతో కలిసి టీ తాగుతున్న కెప్టెన్ లక్ష్మీకాంతరావు (ఫైల్)

దేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిన

ఘనత పీవీదే

- 'భారతరత్న'తో ఆయనకు గుర్తింపునివ్వడం గర్వకారణం
- మాజీ ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతరావు, మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్


పీవీ నర్సింహారావుతో మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ (ఫైల్)

హుస్నాబాద్, ఫిబ్రవరి 9: దేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిన ఘనత దివంగత మాజీ ప్రధానమంత్రి పీవీ నర్సింహారావుదేనని రాజ్యసభ మాజీ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతరావు, హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ అన్నారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ బహుభాషాకోవిదుడు, పరిపాలనాధ్యక్షుడు, ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా ఎన్నో పదవులను అలంకరించి వాటికి వన్నెతెచ్చిన పీవీకి కేంద్రం భారతరత్న ఇవ్వడం ఎంతో గర్వకారణమన్నారు. ఇన్నాళ్లకు పీవీ సేవలకు తగిన గుర్తింపు వచ్చిందన్నారు. అప్పుల ఊబిలో కూరుకుపోయిన దేశాన్ని ఆర్థిక సంస్కరణలతో ముందుకు తీసుకెళ్లి దేశాన్ని ఆర్థికంగా నిలబెట్టిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని భీమదేవరపల్లి మండలం వంగర గ్రామానికి చెందిన పీవీ గ్రామీణస్థాయి నుంచి ప్రధానిగా ఎదగడం ఈ ప్రాంత ప్రజలకు ప్రత్యేక గుర్తింపు వచ్చిందన్నారు. తెలంగాణ ముద్దుబిడ్డ, స్వయంగా మా కుటుంబసభ్యుడైన పీవీకి దేశంలోనే అత్యున్నత పురస్కారం భారతరత్న లభించడం హర్షణీయమన్నారు. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆయన్ను అవమానించిందని, కానీ బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ పీవీ కుటుంబానికి ఎంతో గౌరవం ఇచ్చి ఆయన సేవలకు గుర్తింపు ఇచ్చారన్నారు.

ఘనంగా సింగరాయ జాతర

మొక్కులు చెల్లించుకున్న భక్తులు

బందోబస్తు నిర్వహించిన పోలీసులు

లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకున్న ఎంపీపీ కీర్తి, ఏఎంసీ చైర్‌పర్సన్ తిప్పారపు జ్యోతి

సిద్దిపేట జిల్లా కోహెడ మండలం కూరెల్ల సమీపంలో భక్తులతో కిటకిటలాడుతున్న సింగరాయ జాతర

సింగరాయ కొండపై వెలిసిన ప్రతాప రుద్ర లక్ష్మీ నర్సింహస్వామి

భక్తజన సంద్రం

కోహెడ, ఫిబ్రవరి 9: సిద్దిపేట జిల్లా కోహెడ మండలం కూరెల్ల సమీపంలోని గుట్టలో వెలిసిన లక్ష్మీ నర్సింహస్వామి (సింగరాయ) జాతర శుక్రవారం ఘనంగా జరిగింది. జాతరకు భీమండి, పూణె, సోలాపూర్ తదితర పట్టాణాల నుంచే కాకుండా కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్ , వరంగల్ జిల్లాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం ఆరు గంటల నుంచే జాతరకు జనం పోటెత్తారు. కొండల మధ్య పారుతున్న మోయతుమ్మెదవాగులో భక్తులు స్నానాలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం గాజుల బండపై వెలిసిన దుకాణాల్లో మిఠాయిలు, బొంగులు కొనుగోలు చేసి సాయంత్రం ఆరు గంటల వరకు ఆనందంగా గడిపారు. భక్తులు సహపంక్తి భోజనాలు చేసి చెట్లకింద సేదతీరారు. ఎంపీపీ కొక్కుల కీర్తి –సురేశ్, ఏఎంసీ చైర్‌పర్సన్ తిప్పారపు జ్యోతి–శ్రీకాంత్ దంపతులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. కోహెడకు చెందిన పేర్యాల సుకుమార్‌రావు, మైసంపల్లికి చెందిన పోలవేని కుమారస్వామి భక్తులకు మజ్జిక, నీళ్ల ప్యాకెట్లను ఉచితంగా పంపిణీ చేశారు.

సిద్దిపేట జిల్లా కోహెడ మండలం కూరెల్ల సమీపంలో క్యూలో వేచి ఉన్న భక్తులు, గుహలోని లక్ష్మీనర్సింహస్వామి దర్శనానికి మోకాళ్లపై వెళ్తున్న భక్తులు

పారిశుధ్యంపై శ్రద్ధ చూపాలి

సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

కంది జడ్పీహెచ్ఎస్‌లో ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

పటాన్‌చెరు, ఫిబ్రవరి 9: పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ప్రతి వీధిని శుభ్రంగా ఉంచాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. రుద్రారంలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంపూర్ణ పారిశుధ్యంతోనే అంటు వ్యాధులను అరికట్టవచ్చని, పంచాయతీ సిబ్బందితో ప్రణాళికాబద్ధంగా పనిచేసి పచ్చదనం పెంచాలని, మొక్కలను సంరక్షించాలని అధికారులకు సూచించారు.

దేవస్థానంలో ప్రత్యేక పూజలు

కలెక్టర్ వల్లూరు క్రాంతి గణేశ్‌గడ్డ సిద్ధి వినాయక దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థానం అధికారులు, డీఎల్‌పీవో సంతోశ్‌రెడ్డి, ఎంపీడీవో బన్సీలాల్ కలెక్టర్‌ను ఆహ్వానించారు. ఈ సందర్భంగా పూజారులు కలెక్టర్‌తో ప్రత్యేక పూజలు చేయించగా, వేదపండితులు ఆశీర్వదించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల సన్నాహకాల్లో భాగంగా కలెక్టర్ గీతం డీమ్డ్ యూనివర్సిటీని సందర్శించి స్ట్రాంగ్ రూంలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మన్నెరాజు, నర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్ సుధీర్‌రెడ్డి, వెంకన్నయాదవ్, ఎంపీవో హరిశంకర్‌గౌడ్, కార్యదర్శి రాజ్‌కుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.

'పది'లో మెరుగైన ఫలితాలు సాధించాలి

కంది, ఫిబ్రవరి 9: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి పదిలో మెరుగైన ఫలితాలు సాధించాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి ఉపాధ్యాయులకు సూచించారు. కందిలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌ను శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు బోధన, భోజనంతో పాటు ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించి, వసతుల గురించి ప్రధానోపాధ్యాయురాలు వెంకటలక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట మండల ప్రత్యేక అధికారి సంధ్యారాణి, తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీవో విశ్వప్రసాద్, ఎంపీఓ మహేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

స్వచ్ఛమైన వాతావరణం కల్పిద్దాం..

భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణం కల్పించాలని, అందుకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటి రక్షించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ప్రత్యేక పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం కందిలోని పల్లెప్రకృతి వనాన్ని ఆమె సందర్శించారు. పల్లెప్రకృతి వనంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు.


పూజలందుకుంటున్న రామలింగేశ్వరుడు

కూడవెల్లికి పోటెత్తిన భక్తులు

దుబ్బాక, ఫిబ్రవరి 9: సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గం అక్బర్‌పేట–భూంపల్లి మండలంలోని రామేశ్వరంపల్లిలో ఉన్న కూడవెల్లి రామలింగేశ్వరాలయం భక్తజనసంద్రమైంది. మాఘ అమావాస్య సందర్భంగా శుక్రవారం వేకువజాము నుంచే త్రివేణి సంగమంలో (కూడవెల్లి వాగులో) భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం రామలింగేశ్వరుడిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లానే కాకుండా కామారెడ్డి, రంగారెడ్డి, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాలతోపాటు మహారాష్ట్ర నుంచి భక్తులు భారీసంఖ్యలో తరలివచ్చారు. దుబ్బాక , సిద్దిపేట, కామారెడ్డి ఆర్టీసీ డిపోల నుంచి కూడవెల్లి జాతరకు అధికారులు ప్రత్యేకంగా బస్సులు నడిపించారు. ఆలయంలో స్వామివారిని దర్శించుకునేందుకు ధర్మ దర్శనంతోపాటు ప్రత్యేక దర్శనాలు ఏర్పాటు చేశారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి ఆలయం వద్ద భక్తుల రద్దీ పెరిగింది. దీంతో పోలీసు, దేవాదాయశాఖ అధికారులు దైవ దర్శనానికి మరిన్ని వరుసలు ఏర్పాటు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చలువ పందిళ్లు, తాగునీటి వసతి కల్పించారు. ఆరోగ్యకేంద్రం, పోలీసు సేవా కేంద్రాలు ఏర్పాటు చేశారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా సీసీ కెమెరాలతో పాటు భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయం వద్ద మరో నాలుగు రోజులపాటు పెద్ద ఎత్తున జాతర కొనసాగనున్నది. రామలింగేశ్వరాలయం వద్ద దుబ్బాక సీఐ శ్రీనివాస్ నేతృత్వంలో దుబ్బాక, భూంపల్లి ఎస్సైలు, పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. సుమారు లక్షకు పైగా భక్తులు స్వామి వారిని దర్శించుకున్నట్లు ఆలయ ఈవో విశ్వనాథశర్మ, చైర్మన్ చంద్రం తెలిపారు. కూడవెల్లి రామలింగేశ్వరుడిని దుబ్బాక ఎంపీపీ కొత్త పుష్పలతాకిషన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ శేర్ల కైలాష్ దర్శించుకున్నారు.

దుబ్బాక నియోజకవర్గంలోని కూడవెల్లివాగులో పుణ్య స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

పూజలు అందుకుంటున్న దుర్గామాత

ఏడుపాయల్లో 'మాఘ' శోభ

పాపన్నపేట, ఫిబ్రవరి 9: రాష్ట్రంలో అత్యంత ప్రసిద్ధిగాంచిన ఏడుపాయల వనదుర్గాభవానీ మాత సన్నిధిలో మాఘ అమావాస్య సందర్భంగా మాఘ స్నానాలు పెద్దఎత్తున కొనసాగాయి. శుక్రవారం తెలంగాణతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర, తదితర ప్రాంతాల భక్తులు ఏడుపాయలకు చేరుకొని మంజీరా నది పాయల్లో పుణ్యస్నానాలు చేసి దుర్గామాతను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాలను ఆలయ చైర్మన్ బాలాగౌడ్, ఈవో మోహన్ రెడ్డి ప్రారంభించగా, ఆలయ పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఉదయాన్నే 5 గంటలకు ఆలయ అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, ప్రత్యేక పూజలు చేసి మంగళహారతి, పంచామృతాలు, అభిషేకాలు, పట్టువస్త్రాలు సమర్పించారు. భక్తులు అమ్మవారికి ఒడిబియ్యం, తలనీలాలు సమర్పించారు. సంతానం కోసం భక్తులు సంతాన గుండంలో స్నానాలాచరించి మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు భక్తులు డప్పు చప్పుళ్లతో నృత్యాలు చేస్తూ అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా మెదక్ డీఎస్పీ ఫణీందర్, పాపన్నపేట ఎస్సై నరేశ్ ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు చర్యలు తీసుకున్నారు.

యాదాద్రి తరహా ఏడుపాయల అభివృద్ధి

– మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు

యాదాద్రి ఆలయం తరహాలో ఏడుపాయల వనదుర్గాభవానీ మాత ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. శుక్రవారం కుటుంబసమేతంగా ఆయన అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమ్మవారి కటాక్షంతో తన కుమారుడు మైనంపల్లి రోహిత్ మెదక్ ఎమ్మెల్యేగా గెలుపొందారని, అమ్మవారి క్షేత్రాన్ని యాదాద్రి తరహాలో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. మహాశివరాత్రి జాతరకు రూ. 2 కోట్లు ప్రత్యేక నిధులు కేటాయించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరామని, అందుకు ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. త్వరలో ఏడుపాయలకు సీఎంను తీసుకొస్తానన్నారు. ఏడుపాయల్లో సొంత నిధులతో ప్రెస్‌క్లబ్ భవనాన్ని నిర్మిస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు గోవింద్ నాయక్, జిల్లా నాయకుడు ప్రశాంత్ రెడ్డి, మండల కో–ఆప్షన్ గౌస్, శ్రీకాంత్ రెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్ ఉన్నారు.


మంజీరాలో పుణ్య స్నానాలు చేస్తున్న భక్తులు